www.dainamicnews.com

శుభోదయ

# డైనమిక్

ప్రజల కోసం - ప్రగతి కోసం

dianamicnews Tv
dianamicnews.epaper.com

విలేకరులు కావలెను

తెలుగు రాష్ట్రాలలో వెలువడుతున్న డైనమిక్ దినపత్రికలో అన్ని మండలాల వారీగా విలేకరులు కావలెను.



డైనమిక్

CELL : 96523 03089

తెలంగాణా- ఏపి | సంపుటి : 1 | సంచిక : 175 | పేజీలు : 4 | ఎడిటర్ : పర్వతం పరమేష్ | శుక్రవారం 2 అక్టోబర్ 2026 | వెల : 4/-

## ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు

# రెండు డీఏలు



- ఉద్యోగులు, పింఛనర్లకు ప్రభుత్వం శుభవార్త
- 2 డీఏలు మంజూరు చేస్తూ కేబినెట్ ఆమోదం
- కరవు పరిస్థితులపై చేపట్టాల్సిన చర్యలపై కేబినెట్ సబ్‌కమిటీలో చర్చించాలి
- సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు
- త్వరలోనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- ఎరియర్స్‌ను వాయిదాల్లో చెల్లించాలని నిర్ణయం..
- డీఏలతో రాష్ట్ర ఖజానాపై 2,500 కోట్ల భారం..
- కరువు పరిస్థితులపై కేబినెట్ కీలక నిర్ణయాలు..

హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులకు రెండు డీఏలు ఇచ్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 2024 నుంచి బకాయి ఉన్న డీఏలలో రెండు డీఏలను వెంటనే మంజూరు చేయాలని నిర్ణయం తీసుకుంది. అప్పటి నుంచి బకాయి పడ్డ ఎరియర్స్‌ను వాయిదాల్లో చెల్లిస్తారు. దీంతో ప్రతి ఏడాది రాష్ట్ర ప్రభుత్వంపై రూ.2500 కోట్ల భారం పడనుంది. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షత తెలంగాణ సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్రంలో ఎల్‌నినో పరిస్థితులపై కేబినెట్‌లో సుదీర్ఘ చర్చ జరిగింది. రాష్ట్రంలో ఈ వానాకాలంలో దాదాపు 17 శాతం వర్షపాతం లోటు ఉంది. నిన్నటితో రుతుపవనాల కాలం కూడా ముగిసింది. దాదాపు 235 మండలాల్లో తీవ్ర - మిగతా3లో



## లక్షలాది యువత ఆకాంక్షలకు ప్రతీక యూపీఎస్సీ

- యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోదీ
- స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌ను ఆవిష్కరించిన ప్రధాని
- లక్షలాది మంది యువత ఆశయాలకు యూపీఎస్సీ ప్రతీక అని వ్యాఖ్య
- సర్దార్ పటేల్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ సేవలను స్మరించుకున్న ప్రధాని
- భారత పైలట్ స్మిత్ ధైర్యాన్ని కొనియాడిన మోదీ

## కాంగ్రెస్ పార్టీ ఎంతకైనా

# దిగజారుతుంది

- హిందూ దేవుళ్లపై మాట్లాడితే ప్రజల మద్దతు రాదు
- సీఎం రేవంత్ వ్యాఖ్యలకు కిషన్ రెడ్డి కౌంటర్
- అస్సాంకు చెందిన ప్రతిదిన్ అనే పత్రిక నిర్వహించిన సదస్సులో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కిషన్ రెడ్డి తప్పుబట్టారు
- శివుడు, శ్రీరాముడిని వేరు చేసి మాట్లాడాల్సిన అవసరం ఏం వచ్చిందని ప్రశ్నించారు



హైదరాబాద్

హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. రేవంత్ రెడ్డి శివుడు, శ్రీరాముడిని వేరు చేసి మాట్లాడుతున్నారని, అలాంటి మాటలు మాట్లాడాల్సిన అవసరం ఏం వచ్చిందని ప్రశ్నించారు. దిల్లీలో కిషన్? రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఇటీవల అస్సాంకు చెందిన ప్రతిదిన్ అనే పత్రిక నిర్వహించిన సదస్సులో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యల పట్ల ఆయన తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. హామీల గురించి అడిగితే కొత్త వివాదాలు తెరపైకి తెస్తున్నారని, లోక్?సభ విపక్ష నేత రాహుల్ గాంధీ మెప్పుకోసమే రేవంత్ రెడ్డి అలా మాట్లాడుతున్నారని కిషన్ రెడ్డి విమర్శించారు. హిందూ దేవుళ్లపై మాట్లాడితే ప్రజల మద్దతు రాదని, హామీలు అమలు చేసి మంచి పాలన అందిస్తేనే ప్రజల మద్దతు కాంగ్రెస్ పార్టీకి వస్తుందని హితవు పలికారు. మతం, కులం, ప్రాంతాల మధ్య విభేదాలు సృష్టించడం కాంగ్రెస్‌కు అలవాటేనని, రాజకీయ - మిగతా3లో

## సీఈసీ రాజీనామా చేయాల్సిందే

- లేదంటే జంతర్ మంతర్ వద్ద మళ్లీ నిరసనలు: దీప్కే వార్నింగ్
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను చేయాలని సీజేపీ డిమాండ్
- లేనిపక్షంలో నిరసనలు చేపడతామని హెచ్చరిక
- అక్టోబర్ 2 నుంచి ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళనలు





## ఫారం- 6లో మార్పులకు ఎవరు ఆదేశించారు

- ఈసీపై రాహుల్ గాంధీ ప్రశ్నలు
- ఈసీపై మరోసారి రాహుల్ ప్రశ్నల వర్షం
- ఫారం- 6లో మార్పులు చేయాలని టీసీఎస్‌ను ఎవరు ఆదేశించారన్న రాహుల్
- దానిపై టీసీఎస్‌లో ఎవరు సంతకం చేశారని నిలదీసిన కాంగ్రెస్ అగ్రనేత



## కెప్టెన్ మచ్చర్‌ను చూసి భారతదేశం గర్విస్తోంది

- 174 మంది ప్రాణాలు కాపాడిన కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై ప్రధాని మోదీ ప్రశంసలు
- తీవ్రంగా గాయపడినా ప్రయాణికుల ప్రాణాల కోసం పోరాడిన పైలట్
- విమానాన్ని దారి మళ్లించి సౌదీ అరేబియాలో సురక్షితంగా ల్యాండింగ్
- పైలట్ ధైర్యాన్ని ప్రశంసించిన ట్రంప్

## సర్ ప్రక్రియ గడువు మళ్లీ పొడిగించే ఉద్దేశం లేదు



- ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా రాష్ట్రంలో 92 లక్షల మందికి నోటీసులు ఇచ్చాం
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈవో) సుదర్శన్ రెడ్డి
- ఎన్నికల కమిషన్ సర్‌లో కొన్ని మార్పులు చేసింది
- సర్ ప్రక్రియ జరుగుతున్న రాష్ట్రాల్లో ఫామ్-6తో పాటు డిక్లరేషన్ తీసుకోవాలని ఈసీ ఆదేశాలు ఇచ్చింది

## ఖైరతాబాద్ ఉపఎన్నికపై

# సస్పెన్స్



- వాటితో పాటు నిర్వహిస్తారా?.. ముందే నిర్వహిస్తారా?
- ఖైరతాబాద్ నియోజకవర్గ ఉపఎన్నికపై ఉత్కంఠ నెలకొంది
- ఓటర్ల తుది జాబితా ప్రకటించే వరకు ఉప ఎన్నికకు వెళ్లే పరిస్థితులు లేవని తెలుస్తోంది
- 2024 ఏప్రిల్ 23 నుంచి ఖైరతాబాద్ స్థానం ఖాళీ అయింది.
- ఖైరతాబాద్‌లో ఉపఎన్నిక నిర్వహించడంపై కేంద్ర ఎన్నికల సంఘం ఆలోచన

హైదరాబాద్

ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ బై ఎలక్షన్‌పై కేంద్ర ఎన్నికల సంఘం తీసుకునే నిర్ణయంపై సర్వత్ర ఉత్కంఠ నెలకొంది. 2024 ఏప్రిల్ 23 నుంచే ఖైరతాబాద్ నియోజకవర్గం ఖాళీగా ఉన్నట్లు ఇటీవల శాసనసభ కార్యదర్శి గెజిట్ నోటిఫికేషన్ కూడా విడుదల చేశారు. శాసనసభ కార్యదర్శి గెజిట్ నోటిఫికేషన్‌పై కేంద్ర ఎన్నికల సంఘానికి తెలంగాణ రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ కార్యాలయం అధికారులు తాజాగా లేఖ రాశారు. సాధారణంగా ఎక్కడైనా నియోజకవర్గం ఖాళీ అయితే 6 నెలల్లోగా బై ఎలక్షన్ నిర్వహించాల్సి ఉంటుంది. కానీ ఈ నియోజకవర్గ విషయంలో తలెత్తిన పరిణామాలతో ఇది సాంకేతికంగా రెండున్నర సంవత్సరాలుగా ఖాళీగా ఉంది. ఈ పరిస్థితుల్లో వెంటనే ఉప ఎన్నిక ప్రక్రియను ప్రారంభించాల్సి ఉంటుంది. వచ్చే సంవత్సరం ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఉత్తరాఖండ్, గోవా, మణిపుర్, పంజాబ్, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయి. వాటితో పాటే ఖైరతాబాద్ నియోజకవర్గ ఉప ఎన్నిక జరపాలా? లేక ముందే నిర్వహించాలా? అనే అంశంపై అధికారులు చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. - మిగతా3లో

## మరో 15 రోజుల్లో ఈశాన్య రుతుపవనాలు రాక

- 'ఎల్ నినో' ఎఫెక్ట్ ఎప్పటి వరకు ఉంటుందంటే?
- భారత వాతావరణ శాఖ కీలక ప్రకటన
- అక్టోబరు 15 నుంచి 21 మధ్య దేశంలోకి ఈశాన్య రుతుపవనాలు వచ్చే ఛాన్స్ ఉందని వెల్లడి
- మరో కొద్ది రోజుల్లో నైరుతి రుతుపవనాలు ముగియనున్నాయన్న ఐఎండీ



# నాగులేరు అభివృద్ధిపై ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి దృష్టి



**కారంపూడి,శుభోదయ డైనమిక్ వార్త** చరిత్ర ప్రసిద్ధిగాంచిన కారంపూడి నాగులేరు అభివృద్ధి, పరిశుభ్రతపై మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. నాగులేరు పరిసర ప్రాంతాల్లో మురుగు, వ్యర్థాలు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతున్న నేపథ్యంలో సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.నాగులేరు ఒడ్డున బ్రహ్మనాయుడు పేరుతో పార్కు నిర్మాణం చేపడుతున్నారు. పార్కులో వాకింగ్ ట్రాక్, అలంకార మొక్కలు, ప్రజలు విశ్రాంతి తీసుకునేందుకు బల్లలు, పిల్లలు ఆడుకునేందుకు అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేయనున్నారు. ఎమ్మెల్యే రాజకీయ వ్యక్తిగత కార్యదర్శి పుంగలూరి పుల్లయ్య పనులను వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తూ అవసరమైన ఏర్పాట్లలో సహకరిస్తున్నారు.మూడు రోజుల క్రితం కారంపూడి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి, నాగులేరు పరిసరాల పరిశుభ్రతపైనా దృష్టి సారించారు. వీరుల గుడి వెనుక ప్రాంతంలో జరుగుతున్న పనులను మండల అభివృద్ధి అధికారి ఘంటా శ్రీనివాసరెడ్డి పరిశీలిస్తూ పారిశుద్ధ్య కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు.నాగులేరు బ్రిడ్జి ఉత్తర వైపు చిరు వ్యాపారులు వ్యర్థాలను నాగులేటిలో వేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. నాగులేరు పరిశుభ్రతను కాపాడటంతో పాటు ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**నాగులేటిలో నిరంతరం నీరు పారేలా చర్యలు తీసుకోవాలి**

ప్రస్తుత అభివృద్ధి పనులతో పాటు ఎన్‌ఎస్‌పీ కాలువకు ఉన్న ఎస్కేప్ ఛానల్‌కు లాకులు ఏర్పాటు చేసి నాగులేటిలో నిత్యం నీరు పారేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. తద్వారా దిగువ ప్రాంత గ్రామాలకు తాగు, సాగునీరు అందడంతో పాటు నీటి లభ్యత లేక నిలిచిపోయిన సన్నిగండ్ల లిఫ్ట్ ఇరిగేషన్‌ను పునఃప్రారంభించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.లిఫ్ట్ ఇరిగేషన్ పునరుద్ధరిస్తే సుమారు వెయ్యి ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందని, ఈ అంశంపై ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ని అరెస్ట్ చేయాలని అఖిలపక్షాల ఆధ్వర్యంలో మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా

**మేడ్చల్- మల్కాజ్ గిరి అక్టోబర్ 01 శుభోదయ డైనమిక్ :** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామాను కోరుతూ గురువారం అఖిలపక్షాల ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదురుగా ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి మెమోరడం అందచేశారు.ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, సిపిఎం జిల్లా కార్యదర్శి సత్యం, సిపిఐ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి సదానందం, తెలంగాణ జన సమితి అధికార ప్రతినిధి ప్రవీణ్ లు హాజరై మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చాక అన్ని రాజ్యాంగబద్ధ సంస్థలను బలహీనపరిచి ఎన్నికల్లో గెలవడానికి ఉపయోగించుకుంటున్నాయని అందులో భాగంగానే ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎంపిక ప్రక్రియను మార్చి తన ఇష్టమైన వారిని ప్రధాన కమిషనర్ గా ఎన్నుకొని గత 70 సంవత్సరాలుగా ప్రజలు పొందినటువంటి ఓటు హక్కును సర్ పేరుతో తొలగించి మరోసారి పేద మధ్య తరగతి ప్రజలను ఓ ట్లకు దూరం చేస్తుందని విమర్శించారు. బి జె పి రాబోయే ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తుందని , ఓటు ప్రతి భారతీయుడు యొక్క హక్కు కాబట్టి ప్రధాన కమిషనర్ ను రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషన్ లో భాగమైన ప్రధాన కమిషనర్ తో సహా మరో ఇద్దరు కమిషనర్లు తమ అభిప్రాయాలను తెలిపితే ప్రజాస్వామ్య యుతంగా ఆ అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని



కానీ అలా చేయకుండా ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ మోడీ అమిత్ షా కనుసన్నులతో నడుస్తూ వారు చెప్పినట్టు చేస్తున్నారని దానికి నిదర్శనమే నేడు జ్ఞానేష్ కుమార్ పై వస్తున్న ఆరోపణలని కాబట్టి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ రాజ్యాంగ బద్ధహక్కును కాలరాస్తున్నటువంటి జ్ఞానేష్ కుమార్ ని వెంటనే రాజీనామా చేయించి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసేంతవరకు అన్ని రాజకీయ పార్టీలు పోరాటాలను కొనసాగిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమానికి సిపిఐ ధర్మేంద్ర సిపిఎం అశోక్ సిపిఎంఎల్ మాస్ లైన్ ప్రవీణ్ తెలంగాణ జన సమితి లక్ష్మారెడ్డిలో అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సాయిల్ గౌడ్, హరినాథ్ రావు, లక్ష్మి, సత్యప్రసాద్, వి శ్రీనివాస్, మహిళా సమైక్య నాయకురాళ్ళు మాధవి ప్రమీల మహాలక్ష్మి నరసమ్మ రాజేశ్వరి జిల్లా కౌన్సిల్ సభ్యులు దశరథ్, యువజన సంఘం అధ్యక్షులు సల్మాన్ మండల కార్యదర్శులు బాబు నరేంద్ర మరియు మాస్ లైన్ జనసమితి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# బాలానగర్‌లో వరల్డ్‌స్కిల్స్ రజత పతక విజేత మెహ్రున్నిసా బేగంకు ఘన సన్మానం

**మేడ్చల్--మల్కాజిగిరి, అక్టోబర్ 01 శుభోదయ డైనమిక్ :** షాంఘైలో సెప్టెంబర్ 22 నుంచి 27 వరకు జరిగిన 48వ వరల్డ్‌స్కిల్స్ పోటీల్లో రజత పతకం సాధించి భారతదేశానికి అంతర్జాతీయ ఖ్యాతి తీసుకువచ్చిన మెహ్రున్నిసా బేగంను బాలానగర్‌లో స్థానిక నాయకులు, మేధావులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ప్రపంచవ్యాప్తంగా 70 దేశాలకు చెందిన సుమారు 1,400 మంది పోటీదారులు 64 నైపుణ్య విభాగాల్లో పాల్గొనగా, మెహ్రున్నిసా లాజిస్టిక్స్ అండ్ ఫ్రైట్ ఫార్వార్డింగ్ విభాగంలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించారు. అంతర్జాతీయ సముద్ర, వాయు రవాణా, దిగుమతి--ఎగుమతి కస్టమ్స్ విధానాలు, రూట్ ప్లానింగ్, మల్టీమోడల్ రవాణా, ఇన్‌కోటెర్మ్స్, వ్యయ గణనలు, ప్రాక్టికల్ సమస్యల పరిష్కారం వంటి క్లిష్టమైన అంశాల్లో ఆమె ప్రతిభను ప్రదర్శించారు. సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు మెహ్రున్నిసా పట్టుదల, ప్రతిభను అభినందించారు. ఆర్థికంగా పరిమిత పరిస్థితులు ఉన్నప్పటికీ కృషి, పట్టుదలతో అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన ఆమె విజయాన్ని ప్రశంసించారు. ముఖ్యంగా స్థానిక బేకరీలో పనిచేస్తున్న ఆమె తండ్రి మొహమ్మద్ జావేద్ తన కుమార్తె ఆశయాలకు అండగా నిలిచి, ఆమెను ప్రోత్సహించిన తీరును నాయకులు అభినందించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్ ఎల్.ఎస్. రావు, సీపీఎం మెద్చల్ జిల్లా కార్యదర్శి ఇలాపురం



రాజశేఖర్, ఏఐఎంఐఎం నాయకుడు మహంకాళి శంకర్, మాజీ కాంగ్రెస్ బాలానగర్ డివిజన్ అధ్యక్షుడు మధు గౌడ్, అలాగే సమంత్ గౌడ్, అక్రమ్, గోవర్ధన్ రెడ్డి, దివాకర్ తదితరులు పాల్గొన్నారు. మెహ్రున్నిసా సాధించిన విజయం ప్రాంతంలోని యువతులు, ముఖ్యంగా నైపుణ్య రంగాల్లో రాణించాలనుకునే వారికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని నాయకులు పేర్కొన్నారు..తన విజయానికి సహకరించిన తండ్రి, మార్గదర్శకులు, శిక్షకులకు మెహ్రున్నిసా కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ మరింత ఉన్నత స్థాయిలో రాణిస్తూ, తదుపరి తరాలకు స్ఫూర్తిగా నిలవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆమె పేర్కొన్నారు.

## బతుకమ్మ వేడుకల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి : కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**మేడ్చల్--మల్కాజిగిరి, అక్టోబర్ 01,శుభోదయ డైనమిక్ :** కూకట్‌పల్లి నియోజకవర్గంలోని రంగధాముని (ఐడీఎల్) చెరువును గురువారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సందర్శించి, త్వరలో జరగనున్న బతుకమ్మ వేడుకలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పెద్ద సంఖ్యలో మహిళలు వేడుకలకు హాజరయ్యే అవకాశం ఉన్నందున భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా భద్రత, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.వేడుకల ప్రాంతంలో పటిష్ట పోలీసు బందోబస్తు, సమర్థవంతమైన ట్రాఫిక్ నియంత్రణ చేపట్టాలని పోలీసు అధికారులకు సూచించారు. జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్, పారిశుద్ధ్య విభాగాల అధికారులు నిరంతర తాగునీటి సరఫరా, పరిసరాల పరిశుభ్రత, విద్యుత్ దీపాల ఏర్పాట్లను పర్యవేక్షించాలని ,అలాగే బతుకమ్మ వేడుకల్లో సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, సంప్రదాయ పాటలు, ప్రదర్శనలు, అలంకరణలపై అనవసర ఆంక్షలు విధించకుండా చూడాలని ఎమ్మెల్యే సూచించారు.



ఈ తనిఖీలో మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు, డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్‌తో పాటు జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్, హైడ్రా, పారిశుద్ధ్య, పోలీసు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గోపాలపురంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**హుజూర్‌నగర్ రూరల్, శుభోదయ డైనమిక్** హుజూర్‌నగర్ మండలం గోపాలపురం గ్రామంలోని రేషన్ షాపు నం.17 వద్ద స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చీకురి అంజయ్య ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ వేలిశెట్టి అంజనేయులు, ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లంకొండ గురవయ్య, మాజీ సర్పంచ్ శాసనాల నాగ సైదయ్య, వార్డు సభ్యులు, పీఏసీఎస్ డైరెక్టర్ బూరుగడ్డ షేక్ బందేల్లి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## దడువాయి కార్మికుల సమస్యలపై స్పందించిన మంత్రి ఉత్తమ్‌కు కృతజ్ఞతలు

యరగాని నాగన్న గౌడ్ ఆధ్వర్యంలో మంత్రిని సన్మానించిన రాష్ట్ర దడువాయి యూనియన్ నాయకులు



**శుభోదయ డైనమిక్ న్యూస్ -- హుజూర్‌నగర్:** తెలంగాణ రాష్ట్ర అగ్రికల్చర్ మార్కెటింగ్ దడువాయి వేమెన్ అసోసియేషన్, ఐఎన్‌టీయూసీ అనుబంధ కార్మికుల సమస్యలపై స్పందించిన ఇరిగేషన్, సివిల్ సప్లై శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డికి కార్మిక సంఘాల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల సమస్యలను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, వాటిపై సానుకూలంగా స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రాష్ట్ర ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర దడువాయి యూనియన్ అధ్యక్షులు సరసాని సురేందర్ రెడ్డి మంత్రిని సన్మానించి అభినందనలు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం స్పందించడం పట్ల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా యూనియన్ నాయకులు తెలిపారు. కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దడువాయి యూనియన్ అధ్యక్షులు సరసాని సురేందర్ రెడ్డి, రవికుమార్, శ్రీనివాస్, కొండ పద్మ తదితరులు పాల్గొన్నారు.

## మంగాపురంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

లబ్ధిదారులకు కార్డులు అందజేసిన సర్పంచ్ బత్తిని అంజయ్య గౌడ్



**శుభోదయ డైనమిక్ -- హుజూర్‌నగర్** మంగాపురం గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను సర్పంచ్ బత్తిని అంజయ్య గౌడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, నిరుపేద కుటుంబాలకు ఆహార భద్రతతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సులభంగా అందించేందుకు స్మార్ట్ రేషన్ కార్డులు ఉపయోగపడతాయని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి కార్డులు అందేలా అధికారులు, పంచాయతీ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు.కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సుమిత్ర, జీపీఓ గోపయ్య, రేషన్ డీలర్ పెరబోయిన నాగమణి, గ్రామ శాఖ అధ్యక్షుడు పెరబోయిన వెంకటేశ్వర్లు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కత్తి సైదులు, అంగన్వాడీ టీచర్ విజయ, గ్రామ ప్రజలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభం



**శుభోదయ డైనమిక్ -- హుజూర్‌నగర్** గరిడేపల్లి మండలం రాయినిగూడెం గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షులు, గ్రామ సర్పంచ్ రామాంజిగౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.సర్పంచ్ మాట్లాడుతూ అర్హులైన పేద కుటుంబాలకు ఆహార భద్రతతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు సులభంగా అందించేందుకు స్మార్ట్ రేషన్ కార్డులు ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సునీత, మాజీ ఎంపీటీసీ బల్దూర్ సందీప్, మాజీ సర్పంచ్ కడప దేవదానం, ఉప సర్పంచ్ పిడమర్తి నాగరాజు, వార్డు సభ్యులు, రేషన్ డీలర్ గుండు గురవయ్య, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# దామన్న ఆశయాలే మా బాట

కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యం: కొప్పుల వేణారెడ్డి



**సూర్యాపేట,శుభోదయ డైనమిక్** మాజీ మంత్రి స్వర్గీయ రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా సూర్యాపేటలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దామోదర్‌రెడ్డితో తనకు 40 ఏళ్లకు పైగా అనుబంధం ఉందని తెలిపారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. దామన్న ఆశయాలను కొనసాగిస్తూ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని వేణారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హనుమాస్కుంట చెరువు అభివృద్ధికి కృషి చేయాలి: డీసీసీ అధ్యక్షులు వజ్రేష్ యాదవ్

హైడ్రా కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేత



**కీసర అక్టోబర్ 01 శుభోదయ డైనమిక్** :. మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చెంగిచెర్ల డివిజన్‌లో ఉన్న హనుమాస్కుంట చెరువు అభివృద్ధి, పరిరక్షణకు చర్యలు చేపట్టాలని కోరుతూ డీసీసీ అధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ హైడ్రా కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. హనుమాస్కుంట చెరువు స్థానిక ప్రజలకు ఎంతో ప్రాధాన్యత కలిగిన జలవనరు అని తెలిపారు. చెరువు అభివృద్ధితో పాటు పరిసర ప్రాంతాల సుందరీకరణ, కాలుష్య నివారణ, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేలా చర్యలు చేపట్టాలని కోరారు. చెరువు పరిధిలో ఆక్రమణలు, మురుగునీటి సమస్యలు ఉంటే వాటిని పరిశీలించి పరిష్కరించాలని, చెరువును సమగ్రంగా అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని హైడ్రా అధికారులను కోరారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని హనుమాస్కుంట చెరువు అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మా రెడ్డి, పుల్లకండ్ల జంగారెడ్డి, పుల్లకండ్ల వెంకట్ రెడ్డి, పుల్లకండ్ల రాజి రెడ్డి, సింగిరెడ్డి రాజు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికుల సమావేశం




**శుభోదయ డైనమిక్ న్యూస్, హుజూర్నగర్:** హుజూర్నగర్ పట్టణంలోని సాయిబాబా థియేటర్ వెనుక ఉన్న భవన నిర్మాణ కార్మిక కార్యాలయంలో అక్టోబర్ 1, 2026న సమావేశం ఏర్పాటు చేసి నిర్వహించారు. ఈ సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం హుజూర్నగర్ మండల ప్రధాన కార్యదర్శి షేక్ ముస్తఫా మాట్లాడుతూ, అక్టోబర్ నెలకు సంబంధించిన జిల్లా సభ్యత్వ రుసుము రూ.120/- ప్రతి కార్మికుడు తప్పనిసరిగా చెల్లించాలని పిలుపునిచ్చారు. అలాగే అక్టోబర్ 11న నిర్వహించనున్న యంగ్ వర్కర్స్ జిల్లా సదస్సును విజయవంతం చేయాలని, అక్టోబర్ 26న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.
అదేవిధంగా నవంబర్ 16, 2026న స్థానిక సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని, డిసెంబర్ 1, 2, 3 తేదీల్లో నిర్వహించనున్న చలో ఢిల్లీ ఆక్యుపై కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి కార్మికుడు భాగస్వామ్యం కావాలని షేక్ ముస్తఫా పిలుపునిచ్చారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ముందుకు సాగాలని, సంఘ కార్యక్రమాల్లో ప్రతి కార్మికుడు చురుకుగా పాల్గొనాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ కోశాధికారి కంచుపాటి రాంబాబు, ఉపతల నరేష్, బుద్ధి నరసింహారావు, రామకృష్ణ, అంజి, మహిళా కన్వీనర్ పద్మా, సైదులుతదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సిరిసిల్లలో సీఎం వ్యాఖ్యలపై బొల్లం మల్లయ్య యాదవ్ ఆగ్రహం

అభివృద్ధి, హామీలపై సమాధానం లేక వ్యక్తిగత విమర్శలే : మాజీ ఎమ్మెల్యే



**కోదాడ, శుభోదయ డైనమిక్ వార్త**, సిరిసిల్లలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ తీవ్రంగా స్పందించారు. కేటీఆర్ ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా వ్యక్తిగత విమర్శలకు ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం ఉన్నప్పటికీ ప్రభుత్వం చేయబోయే అభివృద్ధి పనులపై స్పష్టత లేదన్నారు. ఇచ్చిన హామీల అమలుపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వ్యక్తిగత కక్షలు, రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సారించాలని మల్లయ్య యాదవ్ సూచించారు. సీఎం వ్యాఖ్యలు ప్రజలకు సమాధానాలు ఇవ్వలేకపోతున్నారనే భావన కలిగిస్తున్నాయని ఆయన విమర్శించారు.

# రాష్ట్ర స్థాయి మాక్ పార్లమెంట్‌లో ఉత్తమ ప్రతిభ



**నడిగూడెం శుభోదయ డైనమిక్ వార్త అక్టోబర్** 1 నరసింహులగూడెం విద్యార్థినికి బెస్ట్ పెర్ఫార్మర్ అవార్డు నరసింహులగూడెం గ్రామానికి చెందిన జె. కిశోర్ కుమార్తె జె. హేమహాసిని రాష్ట్ర స్థాయి మాక్ పార్లమెంట్‌లో ప్రతిభ చాటి లిబెస్ట్ పెర్ఫార్మర్ అవార్డు (స్పీకర్)లిను అందుకుంది. మునగాల పీఎం శ్రీ టీజీఎంఎస్ పాఠశాలలో చదువుతున్న హేమహాసిని రాష్ట్ర స్థాయి మాక్ పార్లమెంట్‌కు ఎంపికై, స్పీకర్‌గా ఉత్తమ ప్రతిభ కనబరిచి ఈ అవార్డును సాధించింది. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు హేమహాసినిని అభినందించారు. నరసింహులగూడెం గ్రామానికి గర్వకారణంగా నిలిచిన హేమహాసిని అని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

# దామన్న ఆశయ సాధన కోసం పని చేయాలి

ఏ ఐ సి సి సభ్యులు రాంరెడ్డి సర్వోతంరెడ్డి



**శుభోదయ డైనమిక్ న్యూస్, అక్టోబర్ 01, సూర్యాపేట :**మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు రాచకొండ శ్రీనివాస్, జూలకంటి నాగరాజు ఆధ్వర్యంలో సూర్యాపేట కొత్త బస్టాండ్ ప్లే ఓవర్ వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతూ భాస్కర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు మొరిశెట్టి లక్షాది లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దామన్న ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని అన్నారు. దామన్న పేదల సంక్షేమం కోసం పాటుపడే వారని ప్రభుత్వ పథకాలు పేదలకు అందించే వారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎలిమినేటి అభినయ్,తంగెళ్ల కరుణాకర్ రెడ్డి, వీరన్న నాయక్, ఆలేటి మాణిక్యం, కౌన్సిలర్ లు కొండపల్లి దిలీప్ రెడ్డి, చిలుముల సునీల్ రెడ్డి, రాజేష్ రెడ్డి, యామా సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# నరసింహలగూడెం గ్రామానికి గర్వకారణం.. ఉయ్యాల పాండు

ఎన్‌సీసీ ఏఎన్‌ఓ శిక్షణ విజయవంతంగా పూర్తి




**నడిగూడెం, శుభోదయ డైనమిక్** నరసింహలగూడెం గ్రామానికి చెందిన ఉయ్యాల పాండు ఎన్‌సీసీ ఏఎన్‌ఓ (అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్) శిక్షణను విజయవంతంగా పూర్తి చేసి అర్హత సాధించారు. గ్రామానికి చెందిన వెంకన్న (అబ్బులు) కుమారుడైన పాండు క్రమశిక్షణ, పట్టుదలతో శిక్షణను పూర్తి చేయడం పట్ల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఎన్‌సీసీ ఏఎన్‌ఓగా అర్హత సాధించిన ఉయ్యాల పాండును పలువురు అభినందించారు. ఆయన సాధించిన ఈ విజయంతో నరసింహలగూడెం గ్రామానికి మంచి పేరు తీసుకొచ్చారని గ్రామస్తులు పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# చర్చి ప్రహరీ గోడ బేసిమెంట్ కూల్చివేతపై చర్యలు తీసుకోవాలి

ఆర్. యం. పి చింత ఇంద్రయ్య, అంగన్వాడీ టీచర్ సుధారాణి వారి కుటుంబం నుండి ప్రాణహాని ఉంది

బిషప్ దుర్గం ప్రభాకర్ ఆవేదన



**శుభోదయ డైనమిక్ న్యూస్, అక్టోబర్ 01, సూర్యాపేట** : సూర్యాపేట రూరల్ మండలం కేసారం గ్రామంలోని బేతెస్థ ప్రార్థనా మందిరం ప్రహరీ గోడ బేసిమెంట్‌ను అక్రమంగా కూల్చివేశారని, తనను బెదిరిస్తున్న ఆర్.ఎం.పి. డాక్టర్ చింత ఇంద్రయ్య, ఆయన భార్య అంగన్‌వాడీ టీచర్ చింత సుధారాణి తదితరులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బిషప్ దుర్గం ప్రభాకర్ కోరారు. చర్చిలో ప్రార్థనలు నిర్వహిస్తే చంపేస్తామని బెదిరిస్తున్నారని, తనకు ప్రాణహాని ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తనను హతమార్చేందుకు సుపారీ ఇచ్చినట్లు కొందరు ఫోన్ చేసి నాకు తెలిపారనీ. భయంతో నాలుగు వారాలుగా చర్చికి వెళ్లడం లేదన్నారు. ఈ విషయంపై పోలీస్ స్టేషన్‌లో ఇప్పటికే ఫిర్యాదు చేసినట్లు, మరోసారి ఫిర్యాదు చేసి సూర్యాపేట జిల్లా ఎస్పీని కలిసి రక్షణ కల్పించాలని కోరుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మొగిలి ఎల్లయ్య, అబ్రహం, సుధాకర్, కరుణశ్రీ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

# హ్యాపీ బర్త్‌డే అయాన్ ??




ఏడో వసంతంలోకి అడుగుపెట్టిన చిన్నారి అయాన్‌కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో అయాన్ 7వ పుట్టినరోజు వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగాయి. అయాన్ ఆయురారోగ్యాలతో, ఆనందంగా, విజయాలతో జీవితంలో మరింత ఎత్తుకు ఎదగాలని ఆకాంక్షిస్తున్నాం.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేసిన చైర్మన్ కొణతం చిన వెంకటరెడ్డి

అనారోగ్య బాధితులకు రూ.60 వేల చొప్పున ఆర్థిక సాయం



**నేరేడుచర్ల,శుభోదయ డైనమిక్ వార్త**, అక్టోబర్ 1నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ కొణతం చిన వెంకటరెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. దాచారం శ్రీరాం నగర్‌కు చెందిన అలుగుబెల్లి సావిత్రమ్మ, కొండేటి మాధవరెడ్డికి వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.60 వేల చొప్పున మంజూరైన చెక్కులను అందించారు.

**పేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ అండ**

ఈ సందర్భంగా చైర్మన్ కొణతం చిన వెంకటరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆశీస్సులతో నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అనేక మంది లబ్ధి పొందుతున్నారని తెలిపారు. పేద కుటుంబాలకు వైద్య ఖర్చుల సమయంలో సీఎం రిలీఫ్ ఫండ్ ఆర్థికంగా అండగా నిలుస్తుందని పేర్కొన్నారు.

**ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం**

కాంగ్రెస్ పార్టీ ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తోందని చైర్మన్ తెలిపారు. అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పేర్వాల రంగారెడ్డి, కొండేటి అరవిందరెడ్డి, కోట వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

# మహిళ దారుణ హత్య!

మరిది హత్య చేసినట్లు అనుమానం



**కారం పూడి, శుభోదయ డైనమిక్** కారంపూడి పట్టణంలోని వినుకొండ రోడ్డులో పెద్ద మసీదు సమీపంలో రమావత్ శ్రీలక్ష్మీబాయి (35) అనుమానాస్పదంగా మృతి చెందింది. బంగారం తాకట్టు వ్యవహారంలో మరిది బాబా నాయక్‌తో వివాదం జరిగినట్లు బంధువులు తెలిపారు. గొడవ జరిగినట్లు భర్తకు ఫోన్ చేసిన అనంతరం ఇంటికి వెళ్లగా తాళం వేసి ఉండటంతో పగులగొట్టి చూడగా శ్రీలక్ష్మీబాయి ఉరివేసుకుని కనిపించినట్లు భర్త ఆంజనేయ నాయక్ తెలిపాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆవుల భాస్కర్ తెలిపారు.

# ఎస్సీ బాలికల హాస్టల్‌లో ఆకస్మిక తనిఖీ..

బాలికలతో కలిసి భోజనం చేసిన అధికారులు



**శుభోదయ డైనమిక్ న్యూస్ -- హుజూర్‌నగర్:** హుజూర్‌నగర్ పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని హుజూర్‌నగర్ తహసీల్దార్ బండ కవిత ఆదేశాల మేరకు కార్యాలయ సిబ్బంది మేకపోతుల శ్రీనివాస్, వీరబాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని వసతులు, బాలికలకు అందుతున్న భోజనం, ఇతర సౌకర్యాలపై వారు పరిశీలించారు. బాలికలతో నేరుగా మాట్లాడి వారికి ఏవైనా సమస్యలు ఉన్నాయా, ముఖ్యంగా భోజనం విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులు బాలికలతో కలిసి భోజనం చేసి, భోజనం నాణ్యతను స్వయంగా పరిశీలించారు. బాలికలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన సౌకర్యాలు అందుతున్నాయా అనే విషయాలను తెలుసుకున్నారు.
వసతి గృహంలో సమస్యలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. బాలికల సంక్షేమం, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

# రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక




**నడిగూడెం శుభోదయ డైనమిక్ వార్త** అక్టోబర్ 1నడిగూడెం: స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఎన్. గీతాంజలి రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు ఎంపికైంది. పీఎం శ్రీలో భాగంగా సూర్యాపేటలో నిర్వహించిన జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ చింతలపాటి వాణి గురువారం గీతాంజలిని అభినందించారు. మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. వివిధ సబ్జెక్టుల్లో విజ్ఞానాన్ని పెంపొందించుకున్నప్పుడే క్విజ్ పోటీల్లో రాణించగలరని ఆమె అన్నారు. గీతాంజలికి మార్గదర్శకత్వం వహించిన గైడ్ టీచర్ ఎం. వసంతను కూడా అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నిధులిస్తూనే... కళ్ళేలూ వేయాలి!

పునర్వినియోగానికి వీలైన అంతరిక్ష వాహక నౌకను (ఆర్ఎల్వీ) లేదా రాకెట్‌ను తయారు చేయడం అత్యంత క్లిష్టమైన, అదే సమయంలో అత్యంత వాంఛనీయమైన విషయం. అటువంటి పనికి అగ్ని కుల్ కాస్మోస్ అనే ప్రైవేటు అంతరిక్ష సంస్థ శ్రీకారం చుట్టింది. దానికయ్యే వ్యయంలో రూ. 200 కోట్లను పంచుకునేందుకు శాస్త్ర, సాంకేతిక విజ్ఞాన శాఖ (డీఎస్టీ) ఇటీవల ఆ సంస్థతో ఒక ఒప్పందంపై సంతకం చేసింది. పరిశోధన--అభివృద్ధికి చెందిన నవీకరణ (ఆర్డీఐ) నిధి నుంచి డీఎస్టీ ఆ ద్రవ్యాన్ని అందించనుంది. ఈ టెక్నాలజీని అందిపుచ్చుకుంటే తయారీ, ప్రయోగ వ్యయాన్ని చాలావరకు తగ్గించుకోవచ్చు. అంతరిక్షంలో శకలాల బెడదను కూడా పనిలో పనిగా తగ్గించుకున్నట్లవుతుంది. ఈ విషయంలో చైనా, జపాన్ ముందడుగు వేసినట్లుగా ఇటీవల వార్తలు వచ్చిన నేపథ్యంలో, భారత్ కూడా ఆ దిశగా నడుం బిగించింది. పునర్వినియోగ రాకెట్ టెక్నాలజీని చైనా ఈ ఏడాది జూలైలో ప్రదర్శించింది. లాంగ్ మార్చ్ 10బి రాకెట్ ఒక ఉపగ్రహాన్ని కక్ష్యలో ప్రవేశపెట్టిన తర్వాత, ఆ రాకెట్‌కు చెందిన మొదటి దశను చైనా రికవర్ చేయగలిగింది. నియమిత వేగంతో సముద్రంలోని ఒక వేదికపై దిగేటట్లుగా ఆ రాకెట్‌కు రూపకల్పన చేశారు. దాంతో ఆర్బి టల్--క్లాస్ రాకెట్‌ను నిలువుగా దిగేటట్లు చేసిన ఘనతను, అమెరికా తర్వాత సాధించిన రెండవ దేశంగా చైనా అవతరించింది. ఎలాన్ మస్క్ నెలకొల్పిన స్పేస్ ఎక్స్ అటువంటి ల్యాండింగ్‌లను డజన్లకొద్దీ ప్రదర్శించి, అంతరిక్ష రవాణా ఖర్చును తగ్గించుకుంది. చైనా జెండా ఎగరేసిన కొద్ది రోజుల తర్వాత, తన ఆర్ఎల్వీ నమూనాను జపాన్ పరీక్షించింది. ఫ్రాన్స్, జర్మనీ అంతరిక్ష సంస్థ లతో కలసి జపాన్ అంతరిక్ష సంస్థ మిత్సుబిషి సంయుక్తగా ఆ ప్రోటోటైప్‌ను తయారు చేసి ప్రయోగించి చూసింది. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చేపట్టిన ఆర్ఎల్వీ ప్రాజెక్టునకు 2012లో ఆమోదం లభించింది. అప్పటి నుంచి అటాన మస్ ల్యాండింగ్, సూపర్ సోనిక్ ఫ్లైట్, పవర్డ్ క్రూజ్ ఫ్లైట్ వంటి వివిధ టెక్నాలజీలను ఇస్రో అభివృద్ధి చేసి, ప్రయోగాల ద్వారా వాటిని మదింపు చేసింది. ఈ ఆర్ఎల్వీకి 2024లో పుష్పక్ అని పేరు పెట్టారు. అగ్నికుల్ సంస్థ రాకెట్‌ను అగ్నిబాణ్‌గా పిలుస్తున్నారు.



**ప్రైవేటుకు మద్దతు ఇస్తారు సరే...**

ఇపుడు అగ్నికుల్‌కు రూ. 200 కోట్ల ఆర్థిక మద్దతు అందించేందుకు ముందుకు రావడం వల్ల, ప్రభుత్వానికి చెందిన ఒక పరిశోధన--అభివృద్ధి సంస్థతో ప్రత్యక్షంగా పోటీపడుతున్న ఒక ప్రైవేటు కంపెనీకి, బహుశా మొదటిసారిగా, ప్రభుత్వం చేదోడుగా నిలుస్తోందనే అభిప్రాయం కలుగవచ్చు. కానీ, ఇక్కడో సంగతి గుర్తుంచు కోవాలి. ఒక ప్రైవేటు సంస్థకు నిధులిస్తున్నంత మాత్రాన ఇస్రో ఆర్ఎల్వీ ప్రాజెక్టును ఆకలితో అలమటింటేటట్లు చేయడం కాదు. ఒక్కొక్క మైలురాయిని చేరుకుంటున్న కొద్దీ దానికి నిధులు అందు తూనే ఉంటాయి. పైగా, ఈ రెండు ఆర్ఎల్వీ ప్రాజెక్టులను సరి పోల్చడం సమంజసం కాదు. అవి రెండూ భిన్నమైన టెక్నాలజీ రూపాలను అనుసరిస్తున్నాయి. తుది వినియోగంలో కూడా తేడాలుండవచ్చు. అయినా, ఇస్రోకు చెందిన ఆర్ఎల్వీ ప్రాజెక్టు ప్రాధాన్యాన్ని తగ్గించే అభిమతం లేదని ప్రభుత్వం స్పష్టం చేయడం మంచిది. ప్రైవేటుకు ద్వారాలు తెరవడంపై సైంటిస్టుల యూనియన్ల నుంచి ఆందోళనలు వ్యక్తమైన నేపథ్యంలో ఇది మరింత అవసరం.

జాతీయ ప్రాధాన్యం కలిగిన డీప్ టెక్నాలజీ విభాగంలో రెండు సమాంతర ప్రాజెక్టులకు నిధులు ఇవ్వడం ద్వారా ప్రభుత్వం సమతూకంతోనే వ్యవహరిస్తూ ఉండవచ్చు. పెట్టుబడులను అమలు పరచే తీరు కూడా చాలా ముఖ్యం. ప్రభుత్వ నిధులను అంత పెద్ద యెత్తున అందుకుంటున్న ప్రైవేటు ప్రాజెక్టు అగ్నికుల్ ఒక్కటే కాదు. గణనీయంగా నిధులు అందించే మరో రెండు ఒప్పందాలపై కూడా ఇటీవల సంతకాలు జరిగాయి. బెంగళూరుకు చెందిన గెలాక్స్ ఐ స్పేస్ సొల్యూషన్స్‌కు రూ. 63.84 కోట్లు అందనున్నాయి. అది హై--రిజొల్యూషన్ ఇమేజింగ్ సామర్థ్యం కలిగిన మల్టీ--సెన్సర్ ఉపగ్రహాన్ని అభివృద్ధి చేయనుంది. ఎయిర్ ట్యాక్సీగా ఉపయోగించదగిన చిన్న ఎలక్ట్రిక్ విమానాన్ని తయారు చేసేందుకు (అయ్యే మొత్తం రూ. 570 కోట్ల వ్యయంలో) యుబిఫ్లై టెక్నాలజీస్‌కు రూ. 285 కోట్లు ఇవ్వనున్నారు.

ఇలాంటి ప్రాజెక్టులు చాలావాటికి ప్రభుత్వమిచ్చే నిధుల వాటా, వాటి మొత్తం వ్యయంలో దాదాపు 50 శాతం మేరకు లేదా అంతకుమించి ఉంటోంది. ఈక్విటీ రూపంలో ఈ నిధులు అందిస్తే కనుక, ఆ అంకుర సంస్థలలో ప్రభుత్వం మెజారిటీ వాటాదారు అవుతుంది. వాటి పాలనలోనూ దాని మాటకు విలువ ఉంటుంది. కానీ, ప్రభుత్వం వాటికిస్తున్న నిధులు ఐచ్ఛిక పరివర్తనీయ రుణ పత్రాల రూపంలో ఉంటున్నాయి. అంటే, ప్రభుత్వం ఆ ద్రవ్యాన్ని అప్పుగా ఇస్తోందన్నమాట. ముమ్ముందు దాన్ని ఈక్విటీగా మార్చు కుంటే మార్చుకోవచ్చు.

**వ్యాక్సీన్ కంపెనీల గుణపాఠం**

రుణ రూపంలో ఆది మూలధనాన్ని ప్రభుత్వం సమకూర్చినప్పటికీ, ప్రైవేటు కంపెనీలు సాదారణంగా వాటి ఇన్వెస్టర్లకు, వాటాదారులకు జవాబుదారీగా ఉంటాయి. ప్రభుత్వం మాట విని తీరాలన్న రూలేమీ లేదు. లాభాలు గడించేందుకు విలీనాలు, టెక్నా లజీ బదలాయింపులు వంటివాటికెళ్ళడం ప్రైవేటురంగంలో సాధారణం. ఇక్కడే చిక్కుంది. డీఎస్టీ సమకూర్చే ప్రజా నిధులతో ఒక వ్యూహాత్మక టెక్నాలజీని అభివృద్ధి చేసిన కంపెనీని రేపు ఏ బహుళజాతి కంపెనీయో లేదా అంతకన్నా పెద్ద ప్రత్యర్థి సంస్థో స్వాధీనం చేసుకుంటే, ప్రభుత్వ నిధులతో వ్యూహా త్మక సామర్థ్యాన్ని అభివృద్ధి చేసుకోవడంలోని ప్రయోజనమే దెబ్బ తినవచ్చు. వ్యాక్సీన్ల తయారీలో 1990ల చివరలో ఇలాంటి పరిస్థితే ఉత్పన్నమైంది. ఇపుడు అగ్నికుల్, యుబిఫ్లైలకు డీఎస్టీకి చెందిన ఏ టెక్నాలజీ డెవలప్‌మెంట్ బోర్డు అయితే నిధులు ఇస్తోందో అదే బోర్డు, బహుళజాతి టీకా సరఫరాదారుల గుత్తాధిపత్యాన్ని బ్రేక్ చేసేందుకు, బయోటెక్ అంకుర సంస్థలకు నిధులు ఇచ్చింది. పరిశోధన--అభివృద్ధికి డీఎస్టీ ఉదారంగా ఇచ్చిన గ్రాంట్లతో రెండు భారతీయ కంపెనీలు హెపటైటిస్ వ్యాక్సీన్ ధరలను అంతర్జాతీయంగా విజయవంతంగా తగ్గించగలిగాయి. అయితే, ఆ తర్వాత, ఆ రెండు కంపెనీల్లో ఒకదానిని ఒక పోటీదాయక బహుళజాతి సంస్థ స్వాధీనం చేసుకుంది. డీఎస్టీకానీ, ప్రభుత్వంకానీ దాన్ని ఆపలేకపోయాయి. ఒక ముఖ్యమైన అవసరాన్ని తీర్చే సామర్థ్యాన్ని నిర్మించడంలో ప్రభుత్వ తోడ్పాటును అందుకున్న సంస్థ చివరకు ఒక బహుళజాతి వ్యాక్సీన్ కంపెనీ పరమైంది. డీప్ టెక్ రంగంలో మనం తిరిగి అలాంటి స్థితిలో చిక్కుకోకూడదు. ఏ ప్రైవేటు ప్రాజెక్టులకు నిధులు సమకూరుస్తున్నా ప్రభుత్వం తప్పనిసరిగా కొన్ని నియంత్రణలు చేతిలో పెట్టుకుని సమతుల్యతలను పాటించాలి. ఎందుకంటే, నిధుల స్థాయులు, ఇమిడివున్న టెక్నాలజీల వ్యూహాత్మక ప్రాధాన్యం రెండింటిలోనూ పెడుతున్న పణం ఎక్కువగా ఉంది.

# అధికారం మారితే ప్రమాణం మారేనా?

ఎన్నికల సంఘం సాధారణ ప్రభుత్వ విభాగం కాదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 కింద ఎన్నికల నిర్వహణకు సర్వా ధికారం కలిగిన రాజ్యాంగ సంస్థ. అందువల్ల దాని నిర్ణయాలపై ప్రజలకు విశ్వాసం ఉండటం ప్రజాస్వామ్యానికి అత్యవసరం. ఇటీవల ఎన్నికల సంఘంలోని ఇద్దరు కమిషనర్లు కొన్ని నిర్ణయాలు, విధానాలపై అంతర్గతంగా అభ్యంతరాలు వ్యక్తం చేసి నట్లు వచ్చిన వార్తలను ఈ నేపథ్యంలోనే పరిశీలించాలి. 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' వెల్లడించిన వివరాల ప్రకారం, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి దాదాపు పది నెలల వ్యవధిలో అనేక సందర్భాల్లో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సర్), ఫారం--6, ఓటర్ల డేటాబేస్ కేంద్రీకరణ, సాంకేతిక వ్యవస్థ, అప్పీళ్ల వంటి అంశాలపై అభ్యంతరాలు నమోదు చేసినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కొత్త ఓటర్ల నమోదుకు ఉపయోగించే ఫారం--6లో సర్‌కు సంబంధించిన ప్రశ్నలను చేర్చడంపై చట్టపరమైన అభ్యంతరాలు వ్యక్తమైనట్లు నివేదికలు చెబుతున్నాయి. ఇక్కడ అసలు ప్రశ్న భిన్నాభిప్రాయం ఉన్నదా లేదా అన్నది కాదు. ఆ చర్యకు చట్టబద్ధమైన అధికారం ఎక్కడి నుంచి వచ్చింది? అనేదే. ఎన్నికల సంఘం తన చర్యలన్నీ చట్టం, నిబంధనలకు అను గుణంగానే జరిగాయనీ, పది నెలల కాలంలోని కొన్ని అంతర్గత నోట్లను మాత్రమే చూపడం ద్వారా మొత్తం వ్యవహారంలో ఒక భాగాన్ని మాత్రమే చూపుతున్నారనీ చెబుతోంది. అంతర్గత చర్చలో భిన్నాభిప్రాయాలు ఉండటం అసాధారణం కాదు. ఒక కమిషనర్ అభ్యంతరం వ్యక్తం చేశారనే కారణంతో ఆ నిర్ణయం వెంటనే చట్టవిరుద్ధం కాదు. అయితే దీనికి మరో వైపు కూడా ఉంది. 'తుది నిర్ణయాలు ఏకగ్రీవంగానే జరిగాయి' అనే ప్రకటన ఒక్కటే, ప్రతి చర్యకు చట్టబద్ధమైన అధికారం ఉందని నిరూపించదు. అందుకే మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్లు ఎస్.వై. ఖురేషీ, ఓ.పి. రావత్ సూచించినట్లు, ముఖ్యమైన నిర్ణయాలకు సంబంధించిన రికార్డు లను-- ఎవరు ఏమి ప్రతిపాదించారు, ఎవరు అభ్యంతరం తెలి పారు, తుది నిర్ణయం ఏమిటి, అది ఏకగ్రీవమా లేక మెజారిటీ తోనా-- ప్రజలకు అందు బాటులో ఉంచడం మంచిది. ఇక్కడ ఒక చట్టపరమైన స్పష్టత అవసరం. ప్రతి నిర్ణయం ఏకగ్రీవంగా ఉండాల్సిందేనని చెప్పడం సరైంది కాదు. వర్తించే చట్టపరమైన విధానాన్ని అనుసరించి అవసరమైనప్పుడు మెజా రిటీతో నిర్ణయం తీసుకోవచ్చు. కాబట్టి ప్రశ్న 'అందరూ అంగీకరించారా?' అనేది మాత్రమే కాదు; 'చట్టబద్ధమైన విధానాన్ని అనుస రించి నిర్ణయం తీసుకున్నారా?' అనేదే.




ఇంకా తీవ్రమైన ప్రశ్న ఓటర్ల డేటాబేస్ కేంద్రీకరణకు సంబంధించినది. ఎన్నికల నమోదు అధికారులకు చట్టం ఇచ్చిన అధికా రాలను ఏదైనా కేంద్ర సాంకేతిక వ్యవస్థ అధిగమిస్తే, అది కేవలం సాంకేతిక సమస్య కాదు; అది చట్టపరమైన సమస్య. సాఫ్ట్‌వేర్‌కు స్వయంగా చట్టబద్ధమైన అధికారం ఉండదు. అది చట్టబద్ధమైన అధికారికి సహాయపడాలి కానీ అతని స్థానాన్ని ఆక్రమించకూడదు. అందువల్ల ఓటర్ల డేటాబేస్‌పై స్వతంత్ర సాంకేతిక ఆడిట్ అవసరం. ఎవరు డేటాను మార్చగలరు? ఏ అధికారి ఆదేశంతో మార్పు జరుగుతుంది? స్థానిక ఎన్నికల నమోదు అధికారి నిర్ణయాన్ని కేంద్ర వ్యవస్థ మార్చగలదా? ప్రతి మార్పుకు డిజిటల్ రికార్డు ఉందా? వంటి ప్రశ్నలకు సమాధానాలు రావాలి.

**నిష్పాక్షికంగా ఉండటమే కాదు, కనిపించాలి!**

పశ్చిమ బెంగాల్‌లో తొలగించిన ఓటర్లకు సంబంధించిన భారీ సంఖ్యలో అప్పీళ్ల విషయంలో కూడా ఇదే పారదర్శకత అవసరం. ఎన్నికల సంఘం తరఫున అప్పీళ్లు దాఖలు చేయడానికి ఎవరు అనుమతి ఇచ్చారు? ఏ చట్టం కింద ఇచ్చారు? ఆ నిర్ణయాన్ని ఎవరు అమలు చేశారు? అన్నది రికార్డులతో స్పష్టమవ్వాలి. ఈ వివాదానికి మరో రాజ్యాంగపరమైన నేపథ్యం ఉంది. ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన 2023 చట్టం-- ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ల ఎంపిక కమిటీలో భారత ప్రధాన న్యాయమూర్తి స్థానంలో ప్రధానమంత్రి నియమించే కేంద్ర కేబినెట్ మంత్రిని ఉంచింది. ఇటీవల జస్టిస్ దీపాంకర్ దత్తా ఈ మార్పు కేంద్ర ప్రభుత్వానికి ప్రభావవంతమైన వీటో లభించే పరిస్థితిని సృష్టిస్తుందనీ, ఇది 'పర్సెప్షన్ టెస్ట్' పరంగా ప్రశ్నలు లేవ నెత్తుతుందనీ వ్యాఖ్యానించారు. ప్రజల దృష్టిలో ఎన్నికల సంఘం స్వతంత్రంగా కనిపించాల్సిన అవసరాన్ని ఈ వ్యాఖ్య స్పష్టం చేస్తుంది. ఇక్కడే నవీన్ చావ్లా వ్యవహారం గుర్తుకు వస్తుంది. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ అధికారంలో ఉన్నప్పుడు, 2006లో ఎన్డీఏ 205 మంది ఎంపీల సంతకాలతో రాష్ట్రపతి అబ్దుల్ కలామ్‌కు వినతిపత్రం సమర్పించి, ఎన్నికల కమిషనర్ నవీన్ చావ్లాను తొలగించాలని కోరింది. ఆయనకు కాంగ్రెస్ నాయకులతో రాజకీయ, వ్యక్తిగత సంబంధాలు ఉన్నాయనీ, అవి ఎన్నికల కమిష నర్ నిష్పాక్షికతపై సందేహాలు కలిగిస్తున్నాయనీ ఎన్ డీఏ ఆరోపించింది. ఆ వ్యవహారం సుప్రీంకోర్టు వరకు వెళ్లింది. ఆ సమయంలో బీజేపీ ముందుకు తెచ్చిన ప్రధాన సూత్రం-- ఎన్నికల కమిషనర్ నిష్పాక్షికంగా ఉండటమే కాకుండా, ఉన్నట్టు కనిపించాలి కూడా.

**అధికారంలోనూ, ప్రతిపక్షంలోనూ**

2006 పరిస్థితిని 2026 పరిస్థితితో పూర్తిగా సమానం చేయడం సరైంది కాదు. అప్పటి ఆరోపణలు ఒక కమిషనర్ రాజకీయ సంబంధాలపై ఉండగా, ఇప్పుడు ఎన్నికల నిర్వహణ విధానాలు, ఫారాలు, డేటాబేస్, అంతర్గత నిర్ణయ ప్రక్రియపై కమిషనర్ల అభ్యంతరాలు వెలుగులోకి వచ్చాయి. అయినప్పటికీ రాజ్యాంగ సూత్రం మాత్రం ఒకటే-- ఎన్నికల సంఘంపై ప్రజలకు విశ్వాసం ఉండాలి. 2006లో బీజేపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రాష్ట్రపతి, పార్లమెంటు, న్యాయస్థానం వంటి సంస్థాగత మార్గాలను ఉపయోగించింది. నేడు ప్రతిపక్ష పార్టీలూ అదేస్థాయి ఆధారాలతో ముందుకు రావాలనుకుంటే, కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా అధికారిక రికార్డులు కోరాలి, నిర్దిష్ట చర్యలను న్యాయపరంగా సవాలు చేయాలి, అవసరమైతే స్వతంత్ర ఆడిట్ కోరాలి. మరి బీజేపీ ఏం చేయాలి? 2006లో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కోరిన అదే ప్రమాణాన్ని ఇప్పుడు అధికారంలో ఉన్నప్పుడు కూడా పాటించాలి. ఎన్నికల సంఘంపై వచ్చిన ఆరోపణలను రాజకీయ దాడిగా కొట్టిపారేయకుండా రికార్డులను బహిర్గతం చేయాలి. చట్టబద్ధమైన అధికారం లేకుండా ఏదైనా చర్య జరిగినట్లు నిర్ధారణ అయితే దానిని సరిచేయాలి. ఓటర్ల హక్కులకు నష్టం జరిగితే పరిహార మార్గం కల్పించాలి. తప్పు చేసిన వ్యక్తి ఎవరు అనేకంటే, తప్పు ఎలా జరిగింది, దాన్ని ఎలా నిరోధించాలి అన్నది చూడాలి. ఇది బీజేపీకే కాదు, కాంగ్రెస్‌తో సహా అన్ని పార్టీలకూ వర్తించే ప్రమాణం కావాలి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక ప్రమాణం, అధికా రంలో ఉన్నప్పుడు మరో ప్రమాణం ప్రజాస్వామ్య సంస్థలకు ప్రమాదకరం. ఎన్నికల సంఘం బీజేపీ వైపుందా, కాంగ్రెస్ వైపుందా అనేది ప్రశ్న కాదు. ఎన్నికల సంఘం రాజ్యాంగం వైపు ఉందని ప్రజ లకు స్పష్టంగా కనిపించేలా పనిచేస్తున్నదా? అదే అసలు పరీక్ష. గెలిచినవారికీ, ఓడిపోయినవారికీ ఎన్నికల ఫలితాన్ని అంగీకరించేంత విశ్వాసం కలిగించగలిగితేనే ఎన్నికల సంఘం తన రాజ్యాంగ

## ఎన్ హెచ్.ఆర్ ఎస్ జె సి మాస్ కమ్యూనికేషన్

తెలంగాణ రాష్ట్రచైర్మన్‌గాఎన్. మల్లికార్జున్.



**మేడ్చల్ -మల్కాజ్ గిరి, అక్టోబర్ 01 శుభోదయ డైనమిక్** : నేషనల్ హ్యూమన్ రైట్స్ & సోషల్ జస్టిస్ కమిషన్ (చీఎ=ూజీజ) తెలంగాణ రాష్ట్ర చైర్మన్ గా (మాస్ కమ్యూనికేషన్స్) ఎన్. మల్లికార్జున్ నియమితులయ్యారు. ఈ మేరకు సంస్థ జాతీయ అధ్యక్షుడు మరియు స్థాపకులు డాక్టర్ మెహతాబ్ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భం గా ఎన్. మల్లికార్జున్ మాట్లాడుతూ.. సమాజంలోని వివిధ వర్గాలైన యువత, విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు మరియు సామాన్య ప్రజల్లో మానవ హక్కు లపై సంపూర్ణ అవగాహన, చైతన్యం కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. తనపై ఉంచిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తూ, ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం కోసం నిరంతరం శ్రమిస్తానని తెలిపారు. ఈ నియామకం పట్ల కమిషన్ రాష్ట్ర నాయకులు మరియు మానవ హక్కుల నేతలు హర్షం వ్యక్తం చేశారు. సగ్గ వేణుమా ధవ్ (స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్), జితేందర్ సింగ్ రాణా (స్టేట్ జనరల్ సెక్రెటరీ), డాక్టర్ కొమ్ము వెంకన్నబాబు (స్టేట్ స్పోక్స్ పర్సన్ & ఆర్గనైజింగ్ సెక్రటరీ), సిహెచ్ రమణారెడ్డి (స్టేట్ చైర్మన్ సోషల్ సర్వీసెస్), డాక్టర్ రెడ్యా నాయక్ (స్టేట్ వైస్ ప్రెసిడెంట్), భాస్కర్ పటేల్ (స్టేట్ జాయింట్ సెక్రెటరీ), శ్రీకాంత్ (స్టేట్ కమిటీ మెంబర్) తదితరులు నూతన చైర్మన్ మల్లికార్జున్ కు శుభాకాంక్షలు తెలిపారు.

## స్వచ్ఛతా హీ సేవలో భాగంగా సిఎంసి ఆధ్వర్యంలో శ్రమదానం



**మేడ్చల్--మల్కాజిగిరి, అక్టోబర్ 01 శుభోదయ డైనమిక్** :స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా కొనసాగుతున్న "స్వచ్ఛతా హీ సేవ" కార్యక్రమంలో భాగంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) ఆధ్వర్యంలో కూకట్‌పల్లి సర్కిల్--52 పరిధిలోని కైతలాపూర్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో గురువారం స్వచ్ఛంద శ్రమదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఎంసి కమిషనర్ సృజన, అదనపు కమిషనర్ (హెల్త్ అండ్ శానిటేషన్) జి. వెంకట గోపాల్ రెడ్డి, కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్, ఐఏఎస్ కూకట్‌పల్లి సర్కిల్--52 డిప్యూటీ కమిషనర్ అంజనేయులుతో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. (రామ్‌కీ) సంస్థకు చెందిన పారిశుద్ధ్య సిబ్బంది కూడా కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.
ఈ సందర్భంగా అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు ట్రాన్స్‌ఫర్ స్టేషన్ పరిసరాలను శుభ్రపరచడంతో పాటు వ్యర్థాలను తొలగించి, పరిసరాలను క్రమబద్ధీకరించారు.
స్వచ్ఛ భారత్ మిషన్ లక్ష్యాల సాధనకు సిఎంసి, పారిశుద్ధ్య సిబ్బంది, భాగస్వామ్య సంస్థలు సమన్వయంతో పనిచేస్తున్నాయని అధికారులు తెలిపారు. ప్రజలు కూడా స్వచ్ఛత కార్యక్రమాల్లో చురుకుగా భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు.

## కోదాడలో టాస్క్ కేంద్రానికి స్థల పరిశీలన



**సూర్యాపేట బ్యూరో, శుభోదయ డైనమిక్** కోదాడలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ప్రాంతీయ కేంద్రం ఏర్పాటుకు కేఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధికారులు స్థల పరిశీలన చేపట్టారు. జిల్లా పరిశ్రమల శాఖ అధికారులు, టాస్క్ బృందం, శిక్షణలో ఉన్న డిప్యూటీ కలెక్టర్లు, కోదాడ ఆర్డీవో కలిసి కళాశాల ప్రిన్సిపాల్‌తో మౌలిక వసతులపై చర్చించారు. కళాశాల ప్రాంగణంలో సుమారు 2,900 చదరపు అడుగుల స్థలాన్ని ప్రాథమికంగా గుర్తించారు. మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి చొరవతో కేంద్రం మంజూరైనట్లు అధికారులు తెలిపారు. జిల్లా యంత్రాంగం ఆమోదం అనంతరం తుది నిర్ణయం తీసుకోనున్నారు.

## నల్గొండలో జర్నలిస్టులకు ఏఐ, సోషల్ మీడియాపై వర్క్‌షాప్

3న మీడియా అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం

ముఖ్య అతిథిగా రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి

**నల్గొండ బ్యూరో, శుభోదయ డైనమిక్** రాష్ట్ర మీడియా అకాడమీ ఆధ్వర్యంలో నల్గొండ జిల్లా కేంద్రంలో జర్నలిస్టులకు కృత్రిమ మేధస్సు (ఏఐ), సోషల్ మీడియా అంశాలపై వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. అక్టోబర్ 3న నల్గొండ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగే ఈ వర్క్‌షాప్‌కు రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. నల్గొండ డివిజన్ పరిధిలోని జర్నలిస్టులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. మీడియా రంగంలో వేగంగా మారుతున్న సాంకేతిక పరిజ్ఞానం, ఏఐ వినియోగం, సోషల్ మీడియా వేదికలపై జర్నలిస్టులకు అవగాహన కల్పించడమే వర్క్‌షాప్ ఉద్దేశమని తెలిపారు. చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి అక్టోబర్ 3న ఉదయం 7 గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి 9.30 గంటలకు నల్గొండ చేరుకోనున్నారు. వర్క్‌షాప్ అనంతరం సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం కానున్నారు.

EDITOR & PUBLISHER : PARVATHAM PARAMESH, PLACE OF PUBLICATION : 4-68, LAL LAXMI PURAM, KALLURU, MEDARAM NEREDCHARLA RAOD, SURYAPET,TELANGANA - 508218.
PRINTER : LAXMI NARAYANA KARNATI, RATNA GRAPHICS, PRINTING PRESS (NAME & ADDRESS) 2-3-703/7, THIRUMALA NAGAR COLONY, OPPOSITE POLICE LINE, AMBERPET, HYDERABAD, TELANGANA - 500013. TGTEL/26/A2416, SHUBODHAYA DYNAMIC VAARTA